# మేలుకో ఆంధ్రప్రదేశ్

# తొలిదశ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

### 30 జనవరి 2024, స్వాతంత్ర సమరయోధుల భవనం, విజయవాడ

## ప్రధాన తీర్మానం

**నేపథ్యం:** కాంగ్రెస్ పార్టీ ఇంకా అనేక ప్రాంతీయ పార్టీలు కూడా నియంతృత్వ పార్టీలే. అయితే బి.జె.పి ఒక్కటి మాత్రమే సాధారణ నియంతృత్వాలను మించిన ఫాసిస్టు పార్టీ. బి.జె.పి కార్పోరేట్ ప్రయోజనాలను ఎత్తిపట్టడమే కాక మతోన్మాద, మనువాద రాజ్యవ్యవస్థను స్థాపించడానికి ప్రయత్నిస్తున్నది. నియంతృత్వానికి ఉన్మాద భావజాలం కలగలిపి సంఘ్ పరివార్ శక్తులు ఫాసిజాన్ని స్థాపిస్తున్నాయి. కేంద్రంలో తిరిగి బి.జె.పి ప్రభుత్వం రాకుండా చూడడం అత్యవసరం. ఎన్నికల ద్వారా ఫాసిజం రాగలదని రుజువైన విషయం తెలిసిందే. ఎన్నికలను బాయ్ కాట్ చేయడం కానీ, నోటాకు ఓటు వేయడం కాని సరైన పద్ధతులు కావు. **ఎన్నికల్లో జోక్యం కలిగించుకోవడం ద్వారా ఫాసిజాన్ని ఎదుర్కోవడానికి మేలుకో ఆంధ్రప్రదేశ్ ప్రయత్నిస్తుంది.** వివిధ పార్లమెంటరీ నియోజక వర్గాల్లో అలాగే అసెంబ్లీ నియోజక వర్గాల్లో మేలుకో ఆంధ్రప్రదేశ్ సన్నాహక కమిటీలు ఏర్పడ్డాయి. 2023లో కర్నాటక అసెంబ్లీకి ఎన్నికలు జరిగిన కాలం నుండి అక్కడ పనిచేస్తున్న 'ఎద్దేలు కర్నాటక' స్ఫూర్తితో 'మేలుకో అంధ్రప్రదేశ్' పనిచేస్తున్నది. తెలంగాణాలోనూ ఇతర అనేక రాష్ట్రాల్లోనూ ఇటువంటి వేదికలు పనిచేస్తున్నాయి. ఫిబ్రవరి 6, 7 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగనున్న 8 రాష్ట్రాలు పాల్గొనే సౌత్ జోన్ సమావేశానికి 'మేలుకో ఆంధ్రప్రదేశ్' ప్రతినిధి వర్గానికి ఆహ్వానం ఉంది.

**తీర్మానం:**

1. **ఎన్నికల్లో ఓడించినంత మాత్రాన ఫాసిజం ఓడిపోదని మేలుకో ఆంధ్రప్రదేశ్‌కు తెలుసు.** కాని ఎన్నికల్లో ఓడించకపోతే మరింత ప్రమాదమని ఈ వేదిక భావిస్తుంది. ఎన్నికల్లో ఓడించి అనంతరం ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలన్నింటిలో ఫాసిజాన్ని ఓడించడానికి పనిచేయవలసి ఉంటుందని ఈ వేదిక భావిస్తుంది. ఈ వేదికలో ఉన్న అనేక మంది అటువంటి కార్యాచరణలో దశాబ్ధాలుగా భాగస్వాములు. ఈ వేదిక ప్రస్తుతానికి ఎన్నికలమీద కేంద్రీకరిస్తుంది. ఎన్నికలనంతరం కూడా ప్రజా ప్రతినిధులపై ప్రజాస్వామిక ఒత్తిడిని కలిగించే కార్యాచరణను ఈ వేదిక కొనసాగిస్తుంది.

2. ప్రస్తుత పార్లమెంటులో ప్రాంతీయ పార్టీలే రాష్ట్రం నుండి మొత్తం 25 స్థానాలకూ ప్రాతినిథ్యం వహిస్తున్నాయి. అడిగినా, అడగకపోయినా అవి కేంద్రంలో బి.జె.పికే మద్దతు ఇస్తున్నాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని ప్రజావ్యతిరేక బిల్లులకు అనుకూలంగా ఈ ప్రాంతీయ పార్టీలు ఓటు వేస్తున్నాయి. ప్రజా ఉద్యమం ద్వారా ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావాలి. రాష్ట్ర ప్రయోజనాలకు, రాష్ట్ర ప్రజాభిప్రాయానికి అనుకూలంగా ప్రాంతీయ పార్టీలు వ్యవహరించేట్లు వాటిపై ఒత్తిడి తీసుకురావాలి. **మతోన్మాదాన్ని, మనువాదాన్ని పెంచిపోషిస్తున్న, ఇంకా ప్రధానంగా రాష్ట్రానికి ద్రోహం చేసిన బి.జె.పి కి రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు మద్దతు ఇచ్చే పరిస్థితి మారాలి. అందుకై ఈ వేదిక పనిచేస్తుంది.**

4. కేంద్రంలో బి.జె.పి నాయకత్వాన ఎన్.డి.ఎను ఓడించడానికై కాంగ్రెస్ పార్టీకి, I.N.D.I.A (ఇండియా) భాగస్వామ్య పార్టీలకు ఈ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలి. కాంగ్రెస్, 'ఇండియా' భాగస్వామ్య పార్టీలు గెలిచే అవకాశం ఉన్న అన్ని స్థానాల్లో వారిని గెలిపించడానికి గట్టిగా కృషిచేయాలి. అయితే, కాంగ్రెస్ మరియు 'ఇండియా' భాగస్వామ్య పార్టీలు రాష్ట్రంలో బలహీనంగా ఉన్నాయి. **కేంద్రంలో 'ఇండియా' ప్రభుత్వం ఏర్పడాలంటే, రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలన్నింటిని, కనీసం ఒక్క పార్టీనైనా బి.జె.పి నుంచి విడదీసి 'ఇండియా' వైపు తిప్పుకోవడం అవసరం. అందుకై ప్రాంతీయ పార్టీలపై ఒత్తిడి కొనసాగించాలి.**

5. ఎన్.డి.ఎ బలాన్ని, 'ఇండియా' బలాన్ని గణించినప్పుడు వివిధ అఖిల భారత సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 25 స్థానాలను పరిగణనలోకి తీసుకోవడం లేదు. **రేపు హంగ్ పార్లమెంట్ ఏర్పడితే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 25 మంది లోక్ సభ సభ్యులే నిర్ణయాత్మకవుతారనే గ్రహింపు ప్రధానం.** ఈ 25 మంది ఎటువైపు ఉంటే వారి ప్రభుత్వమే ఏర్పడుతుంది. ప్రస్తుత పరిస్థితి కొనసాగి, రాష్ట్రంలో ఉన్న ప్రాంతీయ పార్టీలన్నీ బి.జె.పికే మద్దతు ఇస్తే తిరిగి దేశంలో ఫాసిస్టు పాలనే ఏర్పడుతుంది. తిరిగి బి.జె.పి అధికారంలోకి వస్తే, హిట్లర్ లాగ రాజ్యాంగాన్ని రద్దుచేయవచ్చు, ఎన్నికలనే నిషేధించవచ్చు. ప్రస్తుత పరిస్థితి మారాలి. రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాంతీయ పార్టీలు ఫాసిస్టు పార్టీ అయిన బి.జె.పి కి దూరం జరగాలని, దానితో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలనన్నింటిని తెంచివేసుకోవాలని ఈ సమావేశం డిమాండు చేస్తుంది.

**6. ఒక్క మాటలో చెప్పాలంటే, కేంద్రంలో ఫాసిస్టు బి.జె.పి తిరిగి అధికారంలోకి రాకూడదంటే రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీలు బి.జె.పితో తెగదెంపులు చేసుకునేటట్లు ప్రజా ఒత్తిడిని నిర్మించాలి. ఇదే ఈ వేదిక ప్రధానమైన కార్యక్రమం. ఎన్నికలకు ముందు, ఫలితాలు వెలువడిన తరవాత, ఏదో ఒక కేంద్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత కూడా బి.జె.పితో దాని మతోన్మాద, మనువాద, ఫాసిస్టు విధానాలతో తెగదెంపులు చేసుకోవాలని లౌకిక, ప్రజాస్వామిక విధానాల కొరకు నిలబడాలని, ప్రధానంగా రాష్ట్ర ప్రయోజనాల కొరకు నిలబడాలని ప్రాంతీయ పార్టీలపై ఒత్తిడి పెట్టడం, ప్రజా ఉద్యమం కొనసాగించడం మేలుకో ఆంధ్రప్రదేశ్ విధానం. బి.జె.పి తో కొనసాగిన ప్రాంతీయ పార్టీలను ఓడించడం, బి.జె.పితో తెగదెంపులు చేసుకున్న పార్టీని గెలిపించడం మేలుకో ఆంధ్రప్రదేశ్ వర్తమాన నినాదం.**

7. అన్నాదురైపై బి.జె.పి నాయకుడు నోరుపారేసుకోవడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడులో ఎ.ఐ.ఎ.డి.యం.కె పార్టీ బి.జె.పితో తన పొత్తును ఫార్మల్‌గానైనా తెంచుకోవలసి వచ్చింది. బి.జె.పితో పొత్తు కొనసాగిస్తే రాష్ట్రంలో ప్రజలు ఛీ కొడతారని భయపడింది. ఇక మన రాష్ట్ర విషయానికి వస్తే, ప్రజల ఛీత్కరిస్తారని తెలిసి ప్రధానమైన ప్రాంతీయ పార్టీ ఏది కూడా నేరుగా బి.జె.పితో ఎన్నికల పొత్తు పెట్టుకోవడం లేదు. బి.జె.పి పై ప్రజల వ్యతిరేకత మరింత బలంగా కనిపిస్తే పరోక్ష పొత్తులకు కూడా భయపడతారు. బి.జె.పి తో పొత్తులపై రాష్ట్ర ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను సంఘటిత పరచడంలోనే మేలుకో ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధన ఆధారపడి ఉందని. సాధ్యాసాధ్యాలు ప్రజాస్వామిక, సెక్యులర్ శక్తుల కార్యాచరణపై ఆధారపడి ఉంటాయని. ఈ ఎన్నికల్లో ఉద్యమకారులు నిరంతరాయంగా, పట్టుదలగా పనిచేయాలని ఈ సమావేశం పిలుపిస్తుంది.

8. మన దేశంలో ప్రస్తుతానికి ప్రజలకు సార్వత్రిక ఓటు హక్కు ఉంది. వారి వారి చైతన్యానుసారం ఓటర్లు తమ ఓటు హక్కును ఉపయోగించుకుంటున్నారు. అయితే ఎన్నికైన ప్రజా ప్రతినిధులు తాము ప్రతిజ్ఞ తీసుకున్న భారత రాజ్యాంగ విలువలకు వ్యతరేకంగా ప్రవర్తిస్తున్నారు. సొంత ప్రయోజనాల కొరకు పార్టీలు మారుతున్నారు. ఎన్నికైన తరువాత తమ ఇష్టా రాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఒక వైపు రాజ్యాంగానికి రెండవ వైపు తమను ఎన్నుకున్న ప్రజానీకానికి తాము జవాబుదారీగా ఉండాలనే స్పృహ వారికి లేకుండా పోయింది. కొద్ది మంది రాజకీయ విశ్లేషకులు కూడా ప్రజా ప్రతినిధుల నిర్లజ్జ వ్యవహారాలను రాజకీయ చతురతగా శ్లాఘిస్తున్నారు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా, భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా ప్రజాప్రతినిధులు వ్యవహరించడాన్ని ఇంకెంతమాత్రం సహించకూడదని ఈ సమావేశం తీర్మానిస్తుంది.

9. మన రాష్ట్ర విషయం చాలా దుర్భరంగా ఉంది. రాష్ట్రానికి బి.జె.పి ద్రోహం చేసినందున రాష్ట్ర ప్రజలకు బి.జె.పి పై వ్యతిరేకత ఉంది. కాని రాష్ట్రంలో ప్రజల నుంచి ఓట్లు పొందిన ప్రాంతీయ పార్టీలు కేంద్రంలో బి.జె.పి నాయకత్వాన గల ఎన్.డి.ఎ ప్రభుత్వానికి ప్రతి బిల్లు విషయంలో కూడా మద్దతు ఇస్తున్నాయి. **రాష్ట్రంలో ప్రజలు వ్యతిరేకించే బి.జె.పి కి మద్దతు ఇచ్చే నైతిక హక్కు ప్రాంతీయ పార్టీలకు లేదు. ఈ విషయాన్నే రాష్ట్రంలో విస్తృతంగా ప్రచారం చేయాలని. ఈ విషయంపై ప్రజలను సంఘటిత పరచాలని. ప్రజా ప్రతినిధులను నియంత్రించే కొత్త ఉద్యమాన్ని బలంగా ముందుకు తీసుకురావాలని ఈ సమావేశం ప్రకటిస్తుంది.**

**భారత రాజ్యాంగ హక్కులు వర్ధిల్లాలి! ప్రజాతంత్ర, లౌకిక సాంప్రదాయాలు వర్ధిల్లాలి!**

**అభినందనలతో...మేలుకో అంధ్రప్రదేశ్**

**సంప్రదించుటకు:** www.melukoap.com, Email: melukoandhrapradesh@gmail.com

కె.యం.ఎ సుభాన్ **9490778602,** ప్రత్యూష సుబ్బారావు **9030644440,** థామస్ పల్లిథానం **9490188935**